


సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

నరసరావుపేట: విద్యుత్ ఉద్యోగులు ఈ నెల 15వ తేదీ నుంచి జరపతలపెట్టిన నిరవధిక సమ్మె పోస్టర్‌ను సోమవారం స్థానిక ఈఈ కార్యాలయంలో ఆవిష్కరించారు.



పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 37,511 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నుంచి దిగువకు 32,511 క్యూసెక్కులు వదులుతున్నారు.



భక్తిశ్రద్ధలతో చండీహోమం

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వేంకటేశ్వర ఆలయ ప్రాంగణంలో భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యాన సోమవారం చండీహోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

డిజిటల్ బుక్‌పై అవగాహన ముఖ్యం

గ్రామ, వార్డు స్థాయి కమిటీలను బలోపేతం చేయండి

- ఒక్కో నియోజకవర్గానికి 14 వేల మంది సైనికులను తయారు చేయడమే లక్ష్యం
- ప్రజల సొమ్ము ప్రైవేటు వారికి ధారాదత్తం చేస్తున్న సర్కారు
- కూటమి వైఫల్యాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించడం కీలకం
- వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వై.వి. సుబ్బారెడ్డి

తాడేపల్లి రూరల్: పార్టీ నాయకులపై, కార్యకర్తలపై కూటమి ప్రభుత్వం చేస్తున్న దాడులను, పెడుతున్న అక్రమ కేసులను, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు డిజిటల్ బుక్‌ను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఏర్పాటు చేశారని రాజ్యసభ సభ్యులు, పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్ వై.వి. సుబ్బారెడ్డి అన్నారు. దానిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. సోమవారం గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లి రూరల్‌లోని కుంచనపల్లిలో ఉన్న ఫార్చ్యూన్ గ్రాండ్ హోటల్‌లో వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లాకు సంబంధించి రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గం, మండల స్థాయి నాయకులతో డిజిటల్ బుక్‌పై అవగాహన సదస్సు, పార్టీ ప్రణాళికలపై విస్తృత స్థాయి సమావేశాన్ని మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి అధ్యక్షత నిర్వహించారు. ముఖ్య అతిథిగా వై.వి. సుబ్బారెడ్డి మాట్లాడుతూ గ్రామ, వార్డు స్థాయిలో డిజిటల్ బుక్‌పై నాయకులకు, కార్యకర్తలకు అవగాహన కల్పించాలన్నారు. వారి రక్షణ కోసమే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఈ డిజిటల్ బుక్‌ను ఏర్పాటు చేశారని అన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను కాస్తోకూస్తో అమలు చేసిందంటే పార్టీ అధినేత చేసిన పోరాట ఫలితమేనని పేర్కొన్నారు. ప్రభుత్వ వైఫల్యాలపైన సైతం కొన్ని పత్రికల వారు భజన చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం అందరికీ ఉన్న ఒకే ఒక్క ఆయుధం సోషల్‌మీడియా అని, ప్రభుత్వ వైఫల్యాలను అందులో ఎండగడుతున్న వారిపై



దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న వై.వి.సుబ్బారెడ్డి

తప్పుడు కేసులు పెడుతున్నారని పేర్కొన్నారు. నాయకులను, కార్యకర్తలను సైతం ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు.

అక్రమ కేసులపై పోరాటమే స్ఫూర్తి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల కోసం ప్రజల సొమ్ముతో ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీలను కూటమి సర్కారు తమ పార్టీ నాయకులకు ధారాదత్తం చేస్తోందని విమర్శించారు. దీనిపై పోరాటం చేస్తున్న వారిపై అనేక దుష్ప్రచారాలు చేస్తూ తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని అన్నారు. 16 నెలల నుంచి లేని లిక్కర్ కేసును సొంత పత్రికల ద్వారా కూటమి ప్రభుత్వం ముందుకు తీసుకువెళుతోందని చెప్పారు. వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియాలో నాయకులు, కార్యకర్తలు ఆ కేసును ఎండగడుతూ నిలదీస్తున్నారని గుర్తుచేశారు. అది పార్టీకి ఉన్న బలమని పేర్కొన్నారు.

ప్రజారోగ్యంతో పాలకుల ఆటలు

గతంలో ఉన్న మద్యం పాలసీని కూటమి ప్రభుత్వం రద్దు చేసి తమ పార్టీ నాయకులతో కల్తీ మద్యాన్ని తయారుచేయిస్తున్న సంగతి గత వారం రోజుల నుంచి చూస్తున్నామని గుర్తుచేశారు. అదే మద్యం దుకాణాలు ప్రభుత్వం చేతిలో ఉంటే ఇలాంటి ఘటనలు జరగవని అన్నారు. కూటమి నాయకుల జేబులు నింపేందుకు కల్తీ మద్యాన్ని అమ్మించి ప్రజల ఆరోగ్యాన్ని నాశనం చేస్తున్నారని ఆయన విమర్శించారు. ఎమ్మెల్సీలు చంద్రగిరి ఏసురత్నం, టి.కల్పలత రెడ్డి, మాజీ మంత్రి మేకతోటి సుచరిత, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తలు అంబటి మురళీకృష్ణ (పొన్నూరు), షేక్ నూరి ఫాతిమా(గుంటూరు తూర్పు), వనమా బాల వజ్రబాబు (తాడికొండ), బలసాని కిరణ్‌కుమార్ (ప్రత్తిపాడు), సీఈసీ సభ్యులు జియావుద్దీన్, మందపాటి శేషగిరిరావు, ఆతుకూరి ఆంజనేయులు, ఎస్ఈసీ సభ్యులు కొలకయూరి కోటేశ్వరరావు, నల్లమోతు రూత్‌రాణి, రాష్ట్ర కార్యదర్శులు నిమ్మకాయల రాజనారాయణ, షేక్ మస్తాన్ వలి, షియాక్ గులాం రసూల్, అన్నపరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి, రాష్ట్ర విద్యార్థి విభాగ అధ్యక్షుడు పానుగంటి చైతన్య, రాష్ట్ర కుమ్మరి శాలివాహన సంఘ అధ్యక్షుడు మండెపూడి పురుషోత్తం, రాష్ట్ర కృష్ణ బలిజ సంఘ అధ్యక్షుడు కోలా భవాని, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వెంకటప్పరెడ్డి పాల్గొన్నారు.

పార్టీ సైన్యమై ప్రజలకు మద్దతివ్వండి



సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

ప్రతి నియోజకవర్గంలో గ్రామ, వార్డు స్థాయి వరకు కమిటీలను ఏర్పాటు చేయాలని వై.వి. సుబ్బారెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 14 వేల మంది వైఎస్సార్‌సీపీ సైనికులను తయారుచేసి ప్రభుత్వ వైఫల్యాలను నిలదీయాలన్నారు. కూటమి తన మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అరకొరగా అమలు చేసిందని పేర్కొన్నారు. త్వరలోనే నిరుద్యోగులు కూడా నెలకు రూ. 3 వేల భృతి కోసం రోడ్డు ఎక్కే పరిస్థితి ఉందని తెలిపారు. మహిళలకు ఇస్తామన్న రూ.1,500 కోసం పోరాటాలు జరుగుతాయని పేర్కొన్నారు. వారికి మద్దతు తెలిపి ప్రభుత్వం ఆయా హామీలు అమలు చేసేలా చూడాలని అన్నారు. అనంతరం డిజిటల్ స్క్రీన్‌పై ఫిర్యాదు చేసే విధానం, ప్రభుత్వ వైఫల్యాలను ఎలా ఎండగట్టాలి, వార్డు, గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాల్సిన తీరును వివరించారు. అందుకు ముందు నాయకులు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అబద్ధాలు చెప్పలేని వ్యక్తి వైఎస్ జగన్



మాజీ సీఎం వైఎస్ జగన్ రాష్ట్ర ప్రజలకు అబద్ధాలు చెప్పి అధికారంలోకి రాలేదు. 'అబద్ధం చెప్పి మోసం చేస్తే ప్రజలు మనల్ని క్షమించరు' అని ఆయన అంటుంటారు. కూటమి ప్రభుత్వం ప్రజల్ని వంచించింది. ఆ నేతల అబద్ధపు ప్రచారాలను వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు వివరించాలి. డిజిటల్ బుక్ ద్వారా పాలకుల వైఫల్యాలను ఎండగట్టాలి.

– మోదుగుల వేణుగోపాల రెడ్డి, మాజీ ఎంపీ

ప్రభుత్వం మూల్యం చెల్లించుకోవాల్సిందే



కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రతిపక్షంపై, ప్రశ్నించిన సామాన్య ప్రజలపై కక్ష సాధిస్తోంది. హామీలను అమలు చేసేంత వరకు ప్రజల పక్షాన పోరాడాలి. పాలకులు తప్పుడు కేసులు పెడితే... రక్షించేందుకే పార్టీ అధినేత వైఎస్ జగన్ ఈ డిజిటల్ బుక్ ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం ప్రజల్ని మోసగించినందుకు త్వరలోనే మూల్యం చెల్లించుకోక తప్పదు.

–పోతిన మహేష్, గుంటూరు జిల్లా పరిశీలకుడు

కేసులతో పార్టీని అడ్డుకోవడం అసాధ్యం



కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులను, కార్యకర్తలను అక్రమ కేసులతో అడ్డుకోవడం సాధ్యం కాదు. ప్రభుత్వం రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థను అడ్డుపెట్టుకుని ప్రజలను భయభ్రాంతులకు గురిచేసినప్పుడే దాని పతనం ప్రారంభమైంది.

– దొంతిరెడ్డి వేమారెడ్డి, మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త

న్యూస్‌రీల్

నేటి 'చలో విజయవాడ'కు వైఎస్సార్‌టీఏ మద్దతు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ మంగళవారం విజయవాడలోని ధర్నా చౌక్‌లో ఫ్యాప్టో తలపెట్టిన మహాధర్నాకు వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ (వైఎస్సార్‌టీఏ) మద్దతు తెలుపుతున్నట్లు సంఘ రాష్ట్ర నాయకుడు చందోలు రవికుమార్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని, బోధనేతర కార్యక్రమాలను వారికి అప్పగించవద్దని ఎన్ని విజ్ఞప్తులు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. 12వ పీఆర్సీ, మధ్యంతర భృతి మంజూరు, పాత పెన్షన్ విధానం, ఆర్థిక బకాయిల చెల్లింపు, పెన్షనర్లకు కార్పొరేషన్ ఏర్పాటు వంటి హామీలు ఇచ్చిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చి 16 నెలలు అయినా నెరవేర్చలేదని తెలిపారు.

పశ్చిమ డెల్టాకు 7,713 క్యూసెక్కులు విడుదల



దుగ్గిరాల: విజయవాడ ప్రకాశం బ్యారేజ్ నుంచి 7,713 క్యూసెక్కులు విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజ్ వద్ద 12 అడుగులు నీటి మట్టం ఉంది. దుగ్గిరాల సబ్ డివిజన్ హైలెవెల్‌కి 306 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్‌కు 1,888, తూర్పు కాలువకు 620, పశ్చివ కాలువకు 225, నిజాంపట్నం కాలువకు 435, కొమ్మూరు కాలువకు 3,300 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. బ్యారేజ్ నుంచి సముద్రంలోకి 50,025 క్యూసెక్కుల వదులుతున్నారు.

బోధనా నైపుణ్యాలు పెంచుకోవాలి

– పల్నాడు డీఈఓ చంద్రకళ



నరసరావుపేట ఈస్ట్: మెగా డీఎస్సీ–2025 ద్వారా ఉపాధ్యాయులుగా నియామకం పొందినవారు బోధనా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. ఉపాధ్యాయులుగా నియామకం పొందినవారికి అందిస్తున్న శిక్షణా తరగతులను సోమవారం డీఈఓ చంద్రకళ సందర్శించి తరగతుల నిర్వహణ తీరును పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు తమ తమ పాఠశాలల్లోని విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాలని హితవు పలికారు. పల్నాడు జిల్లా విద్యాశాఖ ఏడీ బి.వి.రమణ, శిక్షణ కేంద్రం ఇన్‌చార్జి సత్య నారాయణ సింగ్, ఏఎంఓ పూర్ణచంద్రరావు, రిసోర్స్‌పర్సన్‌లు పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 588.00 అడుగులకు చేరింది. ఇది 306.1010 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు 10,040, ఎడమ కాలువకు 9,076, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 33,211, ఎస్ఎల్‌బీసీకి 1,800, వరద కాలువకు 300 క్యూసెక్కులు విడుదలవుతోంది. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 54,427 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 54,427 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

15న కార్తికేయుని హుండీ కానుకల లెక్కింపు



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానంలో భక్తులు సమర్పించిన హుండీ కానుకల లెక్కింపు ఈ నెల 15వ తేదీ ఉదయం 8 గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామవరప్రసాద రావు సోమవారం తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ సమక్షంలో నిర్వహించే లెక్కింపులో పాల్గొనదలచిన భక్తులు డ్రస్‌కోడ్‌లో హాజరు కావాలని సూచించారు. కానుకల లెక్కింపు కారణంగా ఆ రోజున జరగాల్సిన స్వామివారి నిత్య శాంతి కల్యాణం ఉదయం 7 గంటలకు ప్రారంభిస్తారని తెలియజేశారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం తగదు

జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా

గుంటూరు వెస్ట్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్.)లో అందిన అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దని జిల్లా కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతీ అర్జీ పరిశీలించి, స్పష్టమైన పరిష్కారం చూపాలని అన్నారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం వ్యయప్రయాసలతో వస్తారని గుర్తుచేశారు. పరిష్కారం చూపినప్పుడే సంతృప్తి కలుగుతుందని చెప్పారు. క్షేత్ర స్థాయిలోకి వెళ్లి వాస్తవాలు తెలుసుకోవాలని కోరారు. అర్జీని నిర్దేశిత సమయంలో పరిష్కరించాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రీ ఆడిట్ సక్రమంగా చేయాలని అన్నారు. 220 అర్జీలను కలెక్టర్‌తో



అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్

పాటు జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎస్.ఎస్.కె.ఖాజావలి, ఆర్డీవో కె.శ్రీనివాస రావు, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి గంగారాజు, డిప్యూటీ కలెక్టర్ విజయ లక్ష్మి, డీఎంహెచ్ఓ కె. విజయ లక్ష్మి, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజినీర్ కల్యాణ చక్రవర్తి, జిల్లా అధికారులు పరిశీలించారు.

చనిపోయానని సరుకులు ఆపేశారు

నేను బతికుండగానే చనిపోయానని పేర్కొంటూ రేషన్ ఇవ్వడం కుదరదని అంటున్నారు. సచివాలయానికి వెళితే పట్టించుకోవడం లేదు. నాకు ఇద్దరు పిల్లలు. కూలీ చేసుకుని జీవిస్తున్నా. రేషన్ బియ్యంతోనే కడుపు నింపుకోవాల్సిన పరిస్థితి. ప్రభుత్వం మంచి చేయకపోగా.. ఇలా బతికుండగానే చంపేయడం దారుణం. నాకు న్యాయం చేయండి.

– లక్ష్మి శైలజ, గుంటూరు

ప్రభుత్వం తరఫున సాయమేదీ?

మూడు నెలల క్రితం నా సోదరుడు చవల రంగబాబు మరణించాడు. తురకపాలెంలో నివాసముంటున్న అతను ఇటీవల కలుషిత నీరు కారణంగానే మరణించినట్లు వైద్యులు చెప్పారు. ఇప్పటి వరకు ప్రభుత్వం బాధిత కుటుంబానికి ఎటువంటి న్యాయం చేయలేదు. ప్రాణాలు పోతున్నా స్పందించకపోతే ఎలా?

– సీహెచ్ గ్రేస్, గుంటూరు

యూరియా గోల్‌మాల్ చేస్తున్న తమ్ముళ్లు

- నిబంధనలకు విరుద్ధంగా టీడీపీ నేతల అనుయాయులకు అందజేత
- పొన్నెకల్లు సొసైటీ పరిధిలో రోడ్డుపైనే లారీ నుంచి ట్రాక్టర్లకు యథేచ్ఛగా లోడింగ్
- అడ్డగోలు నిబంధనలతో సామాన్యుడికి మాత్రం తప్పని కష్టాలు

తాడికొండ: కో ఆపరేటివ్ సొసైటీల్లో యూరియా గోల్‌మాల్ జరుగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా అధికార పార్టీకి చెందిన నాయకులు, ప్రైవేటు వ్యాపారులు అందినకాడికి దోచుకుంటున్నారు. దీనిపై సంబంధిత వ్యవసాయ శాఖాధికారుల నిఘా కొరవడటంతో సామాన్యుడికి యూరియా అందని ద్రాక్షగా మారింది. కో ఆపరేటివ్ సొసైటీల ద్వారా సామాన్యులకు యూరియా సరఫరా చేయాల్సి ఉండగా ఎక్కడా అలా జరగడం లేదు. నేరుగా అధికార పార్టీ నాయకులకు, వారి అనుయాయులకు చేరుతోంది. సామాన్యుడికి మాత్రం ఆధార్‌పై నామమాత్రంగా రెండు బస్తాల యూరియా ఇస్తున్నారు. అదీ ఒక నానో యూరియా బాటిల్‌ను అంటగట్టేలా అధికారులు నిబంధనలు విధించారు. కానీ అధికార పార్టీ నేతలకు మాత్రం సొసైటీకి బస్తాలు చేరకుండానే అందించి, బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. సోమవారం తాడికొండ మండలం పొన్నెకల్లు సొసైటీకి చెందిన ఎరువుల లారీ నిబంధనలకు విరుద్ధంగా అడ్డరోడ్డు కూడలిలో ట్రాక్టర్‌కు లోడింగ్ చేస్తుండగా సాక్షి కెమేరాకు చిక్కారు. ఈ క్రమంలో కూలీలు ముఖం దాచుకొని కిందకి దిగి జోర్లు వేయగా... లారీ, ట్రాక్టర్లతో డ్రైవర్లు తలో దిక్కుకు వెళ్లిపోయారు. సొసైటీకి చెందిన యూరియా బస్తాలు ఎవరికి ఇస్తున్నారు? రోడ్డుపై ఎందుకు ఇలా దించుతున్నారు? అని ప్రశ్నించగా ఎవరికి వారే నీళ్లు నములుతూ ముఖం చాటేశారు. రైతులకు సక్రమంగా సరఫరా చేయాల్సిన వ్యవసాయ శాఖ కనీస నిబంధనలకు కూడా నీళ్లొదిలింది. అన్ని సొసైటీల్లోనూ సరుకు తప్పుదారి పడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు యూరియాను సక్రమంగా సరఫరా చేయాలని కోరుతున్నారు.



పొన్నెకల్లు సొసైటీకి చెందిన ఎరువుల లారీ నుంచి నేరుగా ట్రాక్టరుకు యూరియా లోడింగ్

ఆగని మరణమృదంగం

- ఆరు నెలలుగా కొనసాగుతున్న వరుస మరణాలు
- రక్త పరీక్షలు చేసినా ఫలితాల వివరాలు ఇవ్వలేదంటున్న స్థానికులు
- ఆరు రోజులు భోజనాలు, నెలపాటు వైద్య శిబిరంతో సరిపెట్టిన ప్రభుత్వం
- సుమారు 46 మందికిపైగా మృత్యువాత పడినా స్పందించని సర్కారు
- ఎప్పుడు ఏం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటున్న ప్రజలు
- ఇంటికి ఒకరిద్దరు చొప్పున జ్వరాలతో అల్లాడుతున్న గ్రామస్తులు
- కనీసం మరణాలకు కారణం కూడా చెప్పడం లేదని ఆవేదన
- ప్రచారానికే పరిమితమైన కూటమి ప్రభుత్వం చర్యలు
- ఇకనైనా శాశ్వత పరిష్కార చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్

కూటమి పాలకుల నిర్లక్ష్యంతో తురకపాలెంలో మరో మహిళ మృతి

సాక్షి ప్రతినిధి, గుంటూరు/గుంటూరు రూరల్: గుంటూరు రూరల్ మండలం తురకపాలెం గ్రామంలో అంతుచిక్కని మరణాలు కొనసాగుతూనే ఉన్నాయి. గ్రామంలోని చల్లా కృష్ణవేణి (24) పది రోజులపాటు జ్వరంతో బాధపడి చికిత్స పొందుతూ చివరికి గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో ఆదివారం మృత్యువాతకు గురైంది. గత నెల సెప్టెంబర్ మాసంలో 3–4 తేదీలలో చివరిగా రెండు మరణాలు సంభవించిన అనంతరం తీరిగ్గా కూటమి ప్రభుత్వం స్పందించింది. అప్పుడు ఆరు రోజులపాటు గ్రామంలో ప్రజలకు భోజనాలు పెట్టారు. మరో నెల రోజులు మెడికల్ క్యాంప్ అంటూ హడావుడి చేశారు. అనంతరం పాలకులు చేతులు దులుపుకొన్నారు. గ్రామంలో ప్రజల అనారోగ్యానికి కారణం, ఏ వ్యాధితో మరణిస్తున్నారు, దీనికి పరిష్కారం ఉందా? లేదా? అనే అంశాలపై



అధికారులను నిలదీస్తున్న కృష్ణవేణి భర్త దుర్గారావు, పిన్ని, స్థానికులు

గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిర్లక్ష్యం కారణంగానే ప్రాణం బలి

పదిరోజులుగా జ్వరంతో ఉన్న కృష్ణవేణి ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందిన రోజు బాగానే ఉందని, బాగానే మాట్లాడి తిరుగుతూనే ఉందని ఆమె భర్త దుర్గారావు, అత్త తెలిపారు. ప్రైవేటు ఆసుపత్రిలో రోజుకు రూ.30 వేలు అడిగారని చెప్పారు. కూలీనాలీ చేసుకుని బతికే తాము అంత డబ్బు కట్టలేమని చెప్పటంతో జీజీహెచ్‌కు తీసుకెళ్లమన్నారని పేర్కొన్నారు. అక్కడికి వెళ్లాక కనీస స్పందన కరువైందని కుటుంబ సభ్యులు వాపోయారు. వైద్యులు పట్టించుకోలేదని తెలిపారు. చివరి నిమిషంలో కనీసం ఆక్సిజన్ అయినా పెట్టాలని తాము బతిమాలినా పట్టించుకోలేదని వాపోయారు. ప్రభుత్వం, వైద్యుల నిర్లక్ష్యం వల్లే ఇలా జరిగిందని కన్నీరు మున్నీరయ్యారు. అక్కడికి వచ్చిన అధికారులను గ్రామస్తులతో కలిసి నిలదీశారు.

ఆరు నెలలుగా అదే పరిస్థితి..

గ్రామంలో ఆరు నెలలుగా సుమారు 46 మందికిపైగా మృత్యువాతకు గురయ్యారు. దీంతో ప్రజలు ప్రాణభయంతో బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు. కొందరు గ్రామంలో బొడ్డురాయి సమస్య అని ఆందోళన చెందారు. నిపుణులు, రాజకీయపార్టీల నేతలు, అధికారులు కొందరు తాగునీరు కలుషితం కావడం వల్ల సమస్య వచ్చిందని పేర్కొన్నారు. ఈ రెండింటిలో బొడ్డురాయి సమస్యను స్థానిక పెద్దలు సంప్రదాయబద్ధంగా పరిష్కారం చూపారు. మెలియాయిడోసిస్ అనే బ్యాక్టీరియా వల్ల వ్యాధి సంక్రమించి అనారోగ్యాలకు గురవుతున్నారని వైద్యులు తెలిపారు. కానీ ఈ వ్యాధికి చికిత్స ఏంటి? ఏ మందులు వాడాలనే విషయాన్ని గ్రామస్తులకు చెప్పిన వారే లేరు. నెల రోజుల తరువాత మరో మరణం సంభవించటంతో గ్రామంలో కలకలం రేగింది. జీజీహెచ్‌లో చికిత్స పొందిన బాధితురాలు అదే వ్యాధితో మృతి చెందిందని వైద్యులు తెలిపినట్లు కుటుంబ సభ్యులు చెప్పారు.

కొన్ని రోజుల హడావుడే..

గ్రామంలో ప్రజలు ఆకస్మిక మరణాల విషయం వెలుగు చూడటం, మీడియాలో సంచలన కథనాలు, వార్తలు రావడంతో ప్రభుత్వం హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించింది. గ్రామంలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసింది ఇంటింటికీ తిరిగి రక్త నమూనాలు సేకరించారు. పరీక్షలు చేశారు. గ్రామంలో దాదాపు వెయ్యి మందికి కిడ్నీ సమస్యలున్నాయని తేలిందని, మరో 300 మందికిపైగా లివర్ సమస్యలతో బాధపడుతున్నారని గుర్తించామని వైద్యులు తెలిపారు. వారికి పరీక్ష ఫలితాలను ఇవ్వలేదు. టాబ్లెట్, ఇంజక్షన్ కూడా లేదు. ఆరు రోజులు స్థానికులకు భోజనాలు ఏర్పాటు చేశారు. తర్వాత ఆ ఊసే లేదు. మరణించినవారి కుటుంబాలకు న్యాయం చేయలేదు. బాధితులు కలెక్టరేట్, తదితర అధికారులకు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా వారికి న్యాయం అందని ద్రాక్షగానే మిగిలింది. ఇంటికి ఒకరు ఇద్దరు చొప్పున జ్వరాలతో గ్రామస్తులు బాధపడుతూనే ఉన్నారు. కనీసం ఒక్కరు కూడా తమను పట్టించుకోవటంలేదని వాపోతున్నారు. విలేజ్ క్లినిక్‌లో ఒకరిద్దరు వైద్యులు ఉన్నా ఫలితం లేదని ఆరోపిస్తున్నారు.

ఏఎన్‌యూ ఎమ్మెస్సీ ఫుడ్ సైన్స్ ఫలితాల విడుదల

పెదకాకాని (ఏఎన్‌యూ): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఎమ్మెస్సీ ఫుడ్ సైన్స్, న్యూట్రిషన్ డైటాటిక్స్ కోర్స్ రెండవ సెమిస్టర్ ఫలితాలను సీఈ ఆలపాటి శివప్రసాద్‌రావు సోమవారం విడుదల చేశారు. ఈ కోర్సులో 73 మంది పరీక్షలు రాయిగా, 64 మంది ఉత్తీర్ణత సాధించారని ఆయన పేర్కొన్నారు. రీవాల్యుయేషన్‌కు ఈ నెల 15వ తేదీలోగా ఒక్కో పేపర్ కు రూ.1,860 చెల్లించాలని ఆయన సూచించారు. అలాగే వ్యాయామ కళాశాలలో పీజీ డిప్లొమా ఇన్ యోగా ఫర్ హ్యూమన్ ఎక్సలెన్స్ (సంవత్సరం), ఎమ్మెస్సీ ఇన్ యోగా ఫర్ హ్యూమన్ ఎక్సలెన్స్ (రెండు సంవత్సరాలు), ఎంఎస్సీ యోగా లేట్రల్ ఎంట్రీ కోర్సులకు కౌన్సెలింగ్ పూర్తి అయిన తర్వాత మిగిలి ఉన్న సీట్లకు వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో ఈ నెల 7 నుంచి 20 వ తేదీ వరకు అడ్మిషన్లు జరుగుతాయని కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పీపీఎస్ పాల్ కుమార్ తెలిపారు. పీజీ డిప్లొమా, ఎమ్మెస్సీ కోర్సులలో చేరటానికి డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎంఎస్సీ యోగా లేటరల్ ఎంట్రీ కోర్సులో చేరటానికి విశ్వవిద్యాలయంలో పీజీ డిప్లొమా ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులన్నారు. వివరాలకు 73964 58123, 97030 00795 ఫోను నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 2,000 గరిష్ఠం : రూ. 2,700

మోడల్ ధర రూ. 2,400

మిర్చి యార్డు సమాచారం (సోమవారం ధరలు)



వచ్చిన బస్తాలు	29,714
అమ్మకాలు	27,562
నిల్వ	6,273

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500–14,200
నంబరు–5	10,000–14,300
341	10,000–14,600

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500–14,300
నంబరు–5	10,000–14,000
341	10,000–15,000

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 14,800
బాడిగ–355	10,000 – 15,000
దేవనూరు డీలక్స్	10,000 – 14,000
ఆర్మూర్	9,800 – 12,000
తాలుకాయలు	6,000 – 6,900

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000–14,800
బాడిగ – 355	10,000–15,200
దేవనూరు డీలక్స్	10,500–14,200
తాలు	5,200 – 7,000

–కొరిటిపాడు (గుంటూరు)

క్లుప్తంగా

జిల్లా వ్యాప్తంగా వర్షాలు

కొరిటిపాడు (గుంటూరు): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం వల్ల గుంటూరు జిల్లా వ్యాప్తంగా తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు అత్యధికంగా గుంటూరు పశ్చిమలో 49.6, అత్యల్పంగా వట్టిచెరుకూరు మండలంలో 1 మి.మీ. వర్షపాతం నమోదైంది. సగటు 16.5 మి.మీ.గా కురిసింది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు.. తెనాలి మండలంలో 47.2, మంగళగిరి 42.4, గుంటూరు తూర్పు 42.2, పెదనందిపాడు 15.2, పొన్నూరు 15, దుగ్గిరాల 13.8, కాకుమాను 12.4, ఫిరంగిపురం 9.8, తుళ్ళూరు 8.4, పెదకాకాని 8, తాడేపల్లి 6.2, తాడికొండ 6.2, ప్రత్తిపాడు 6, చేబ్రోలు 5.4, కొల్లిపర 5.2, మేడికొండూరు మండలంలో 2.2 మి.మీ. చొప్పున వర్షపాతం కురిసింది.

బేల్దారి పనులు.. ఆరితేరి చోరీలు

- మారుతాళాలతో ద్విచక్రవాహనాలు దొంగిలించిన వ్యక్తి అరెస్ట్
- వాహనాలు కొనుగోలు చేసిన మరో ముగ్గురు కూడా అరెస్ట్
- రూ.25 లక్షల విలువ చేసే 50 బైకులు స్వాధీనం చేసుకున్న పోలీసులు



స్వాధీనం చేసుకున్న వాహనాలను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

నగరంపాలెం: ద్విచక్ర వాహనాలు చోరీ చేసిన వ్యక్తితోపాటు వాటిని కొనుగోలు చేసిన మరో ముగ్గుర్ని కొత్తపేట పోలీసులు అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. వారి నుంచి సుమారు రూ.25 లక్షల విలువైన 50 బైకులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గుంటూరు నగరంలోని పోలీస్ పరేడ్ మైదానంలో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో కేసు వివరాలను జిల్లా ఎస్పీ వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ... బైకుల చోరీలు ఎక్కువ కావడంతో కొత్తపేట పోలీస్‌స్టేషన్ సీఐ వీరయ్యచౌదరి కేసు నమోదు చేశారన్నారు. తూర్పు సబ్ డివిజనల్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ పర్యవేక్షణలో కొత్తపేట పీఎస్ సీఐ వీరయ్య చౌదరి, ఎస్ఐ రమేష్ ప్రత్యేక బృందాలుగా దర్యాప్తు చేపట్టారని పేర్కొన్నారు. పల్నాడు జిల్లా గురజాల మండలం లక్ష్మీటాకీస్ రోడ్డులో ఉంటున్న బొప్పూరి మల్లికార్జునరావు (52) అలియాస్ పున్నారావు అలియాస్ పెద్ద ఆంజనేయులును మాయాబజార్‌లో గుర్తించామన్నారు. గౌరీశంకర్ థియేటర్ పరిసరాల్లో ద్విచక్ర వాహనాలు విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకుని విచారించారన్నారు. నేరం రుజువు కావడంతో అతనితోపాటు వాహనాలను కొనుగోలు చేసిన గురజాలకు చెందిన బైక్ మెకానిక్ రాజశేఖర్, గొర్రెల కాపరి మహేష్, సాతులూరుకు చెందిన బేల్దారి మేస్త్రీ సాంబశివరావులను అరెస్ట్ చేశారని ఎస్పీ తెలిపారు.

18 నెలలుగా దొంగతనాలు

మల్లికార్జునరావు బేల్దారి పనులకు వెళుతూ మద్యానికి బానిసయ్యాడని తెలిపారు. భార్యతో గొడవ పడి సుమారు రెండేళ్ల క్రితం గుంటూరు నగరానికి వచ్చాడన్నారు. ఆరోగ్యం బాగాలేక జీజీహెచ్‌లో చేరి, చికిత్స అనంతరం ఇక్కడే లాడ్జిల్లో ఉంటూ పనులకు వెళ్లేవాడని చెప్పారు. గుంటూరు జీజీహెచ్‌లో, రైల్వేస్టేషన్ పరిసరాల్లో పాత బైకులను మారు తాళాలతో 18 నెలలుగా దొంగిలించాడని చెప్పారు. పల్నాడు జిల్లాలోని పిడుగురాళ్ల, దాచేపల్లి, మాచర్ల, గుంటూరు జిల్లాలోని పాతగుంటూరు, లాలాపేట, అరండల్‌పేటలో అధికంగా దొంగిలించినట్లు విచారణలో గుర్తించామన్నారు. 37 బైకుల యజమానుల చిరునామాలు గుర్తించామని చెప్పారు. బాధితులు ఎవరైనా ఉంటే కొత్తపేట పీఎస్‌లో సంప్రదించాలని సూచించారు. కేసులో ప్రతిభ చూపిన డీఎస్పీ, సీఐ, ఎస్ఐలతోపాటు హెచ్‌సీ ఎం.కోటేశ్వరరావు, కానిస్టేబుళ్లు డి.కోటేశ్వరరావు, టి.అనిల్, షేక్ జానీ బాషా, సీహెచ్ శ్రీనివాసరావు, డి.దేవభిక్షం, ఎన్ఎస్ఆర్ కోటేశ్వరరావులను జిల్లా ఎస్పీ అభినందించారు.

గంజాయి బ్యాచ్‌పై ఫిర్యాదు చేసినా చర్యల్లేవు



బాధితుల సమస్య ఆలకిస్తున్న జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

నగరంపాలెం: గంజాయి మత్తులో ఊగుతూ వచ్చీపోయే వారిని చితకబాదే బ్యాచ్‌పై పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని బాధితులు వాపోయారు. నగరంపాలెంలోని జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక సోమవారం నిర్వహించారు. బాధితుల నుంచి జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలను ఆలకించారు. సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. బాధితులకు చట్టపరమైన పరిష్కారం నిర్దేశిత సమయంలోగా చూపాలని ఎస్పీ ఆదేశించారు. అర్జీలు పునరావృతం కానివ్వ వద్దని సూచించారు. జిల్లా ఏఎస్పీ (పరిపాలన) రమణమూర్తి, డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి (మహిళా పోలీస్‌స్టేషన్), బెల్లం శ్రీనివాసరావు (గుంటూరు ట్రాఫిక్) కూడా అర్జీలు స్వీకరించారు.

రెండుసార్లు దాడులు

సమోసాలు తయారు చేసి దుకాణాలకు వెళ్లి విక్రయించేవాళ్లం. ఈ క్రమంలో గతేడాది ఆగస్టులో ఇంటికి వస్తుండగా క్వారీ వద్ద గంజాయి బ్యాచ్ వారు నాపై దాడికి పాల్పడ్డారు. తప్పించుకుని నల్లపాడు పీఎస్‌లో ఫిర్యాదు చేశా. కేసు నమోదు చేసినా చర్యలు తీసుకోలేదు. ఈ నెల మూడో తేదీన సమోసాలు విక్రయించి వస్తుండగా మళ్లీ నాపై దాడికి పాల్పడ్డారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఈసారి కూడా చర్యల్లేవు. ఒడిశా కార్మికులను కూడా బెదిరించి వారు దాడులకు పాల్పడుతున్నారు. నగదు, మొబైల్ ఫోన్లు లాగేసుకుంటున్నారు. గంజాయి బ్యాచ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతున్నా.

– గంజాయి బ్యాచ్ బాధితులు, చంద్రరాజేశ్వరరావు నగర్

రైల్వేలో ఉద్యోగం పేరుతో మోసం

రెండేళ్ల క్రితం స్నేహితుల ద్వారా ఓ మహిళ పరిచయమైంది. రైల్వేలో ఉద్యోగం చేస్తున్నట్లు ఆమె చెప్పింది. లోకో పైలెట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, డబ్బులు చెల్లిస్తే ఉద్యోగం వస్తుందని నమ్మబలికింది. దీంతో ఆమెకు రూ.20 లక్షల వరకు చెల్లించా. ఆమె చెప్పిన గడువు దాటిన తర్వాత పలుమార్లు ఉద్యోగ విషయం అడిగినా సమాధానం చెప్పలేదు. ఆమెకు డబ్బులు చెల్లించి దాదాపు రెండేళ్లు అవుతోంది. నాకు న్యాయం చేయగలరు.

– బాధిత యువకుడు, పొన్నూరు

ఇల్లు కూల్చివేశారు..

సుమారు మూడేళ్ల క్రితం ఓ వ్యక్తి వద్ద 113 గజాల స్థలం కొనుగోలు చేసి, ఇల్లు నిర్మించుకున్నా. భార్య, పిల్లలతో అక్కడే ఉంటున్నాం. ఈ నెల ఒకటో తేదీన మేము ఇంట్లో లేని సమయంలో ఇరువురు వ్యక్తులు, వారి అనుచరులు వచ్చి రేకుల ఇంటిని కూల్చివేశారు. అందులో ఉన్న రూ.2.50 లక్షలు ఖరీదు చేసే ఐరన్ రాడ్లను ఎత్తుకెళ్లారు. కొన్ని వస్తువులు, పరికరాలను సైతం తీసుకెళ్లారు. వారి నుంచి ప్రాణహాని ఉంది. మాకు న్యాయం చేయగలరు.

– వై.జయప్రకాష్‌రెడ్డి, ఇన్నర్ రింగ్ రోడ్డు

స్థిరమైన ఆర్థిక ప్రణాళిక కీలకం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ శివరామప్రసాద్

గుంటూరు ఎడ్యుకేషన్: భవిష్యత్తు అవసరాలకు తగిన విధంగా డబ్బును పొదుపు చేసేందుకు స్థిరమైన ఆర్థిక ప్రణాళిక ఎంతో కీలకమని ఏఎన్‌యూ రెక్టార్ ఆచార్య ఆర్.శివరామప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో 'సురక్షిత ఆర్థిక ప్రణాళిక – మోసాల నివారణ'పై అవగాహన సదస్సు నిర్వహించారు. ధర్మపీఠం లీగల్ సర్వీసెస్, అభిజ్ఞ భారత్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ముఖ్య అతిథిగా శివరామప్రసాద్ మాట్లాడుతూ.. ఆదాయం పెరుగుతున్న కొద్దీ ఆర్థిక నిర్ణయాలు సైతం క్లిష్టంగా మారుతున్నాయని చెప్పారు. భద్రమైన ఆర్థిక ప్రణాళిక అంటే కేవలం డబ్బును ఆదా చేయడం ఒక్కటే కాదన్నారు. దానిని సక్రమంగా వినియోగించి, భవిష్యత్తులో మనకు అవసరమైన సమయంలో ఆదుకునేలా పెట్టుబడి పెట్టడమేనని వివరించారు.

మోసాలను అడ్డుకునేందుకు చర్యలు

నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ రవిరాజ్ మాట్లాడుతూ దేశ ఆర్థికాభివృద్ధిలో సెక్యూరిటీస్ కీలకపాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. ఈ రంగంలో పారదర్శకత, నైతికత, పెట్టుబడిదారులకు అవగాహన లేకపోతే మోసాలకు గురవుతారని అన్నారు. మార్కెట్ నియంత్రణ, పెట్టుబడిదారుల రక్షణ, పారదర్శక వ్యాపార పద్ధతులు వంటి అంశాల్లో సెబీ నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు. ఇటీవలి కాలంలో పంప్ అండ్ డంప్స్ స్కీమ్స్, సోషల్ మీడియా మోసాలు, డీప్ ఫేక్ వీడియోల ద్వారా పెట్టుబడిదారులు మోసాలకు గురవుతున్నారని తెలిపారు. ఈ మోసాలను అరికట్టేందుకు ప్రచార కార్యక్రమాల ద్వారా ప్రజల్లో అవగాహన కలిగించడం అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు అంశాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సింగరాజు వెంకటరమణ మాట్లాడుతూ డిజిటల్ యుగంలో ఆర్థిక వ్యవహారాలను సురక్షితంగా నిర్వహించడం అవసరమన్నారు. కార్యక్రమంలో ధర్మపీఠం లీగల్ సర్వీసెస్ వ్యవస్థాపకుడు చంద్రశేఖర్, అభిజ్ఞ భారతి వ్యవస్థాపకురాలు డాక్టర్ దుంప శ్రీదేవి, కళాశాల కరస్పాండెంట్ చెరువు రామకృష్ణమూర్తి, ఎంబీఏ, ఎంసీఏ విభాగాధిపతులు డాక్టర్ చక్రవర్తి, రాజ్యలక్ష్మి, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె.లలిత, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కళ్యాణి, సహాయాచార్యులు చల్లా వైష్ణవి, వేదవతి, బాజీబాబు, అనిత, వెంకట్ కళ్యాణ్, ఉమాదేవి, రాజేశ్వరి దేవి, శశికళ, గణేష్, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

సిఫార్సు బదిలీలు నిలిపివేయాలని డిమాండ్

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వం సిఫార్సు బదిలీలు చేపట్టడం చట్టాన్ని ఉల్లంఘించడమేనని, తక్షణమే వాటిని నిలిపివేయాలని ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవ లింగారావు, ఎండీ ఖలీద్ సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. మంగళగిరి మండలం నిడమర్రు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయుడిని అన్యాయంగా వేరొక పాఠశాలకు బదిలీ చేసి, ఆ స్థానంలో కృష్ణా జిల్లా నుంచి హెచ్ఎంను తీసుకురావడం గుంటూరు జిల్లాలోని ప్రధానోపాధ్యాయులకు అవమానమేనన్నారు. చట్టంలో విద్యా సంవత్సరం మధ్యలో ఎలాంటి బదిలీలు ఉండవని చెప్పిన ప్రభుత్వం గుంటూరు జిల్లాకు సంబంధం లేని హెచ్ఎంను తీసుకురావడం సరైనది కాదన్నారు. ఇలా ఆరుగురు ఉపాధ్యాయులు కేటగిరీ 1, 2 పాఠశాలల్లో విధుల్లో చేరినట్లు తెలుస్తోందని చెప్పారు. ప్రభుత్వ చర్యల కారణంగా రాజకీయ పలుకుబడి లేని సాధారణ ఉపాధ్యాయులను ఆందోళనకు గురి అవుతున్నారన్నారు. కౌన్సెలింగ్‌కు విరుద్ధంగా ఉన్న ఈ తరహా బదిలీలను తక్షణమే నిలుపుదల చేయాలన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమం తప్పదని హెచ్చరించారు.

స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల ప్రదానం




అవార్డు అందజేస్తున్న కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా

నెహ్రూ నగర్: స్వచ్ఛ ఆంధ్ర జిల్లా స్థాయి అవార్డుల ప్రదానోత్సవం సోమవారం శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగింది. జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, డిప్యూటీ మేయర్ షేక్ సజీల హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాకు 5 రాష్ట్ర స్థాయి, 48 జిల్లా స్థాయి అవార్డులు వచ్చాయన్నారు. మొత్తం 17 కేటగిరీలలో అవార్డులను ఇచ్చామన్నారు. పరిశుభ్రమైన, హరితమయమైన గుంటూరు జిల్లాను ఆవిష్కృతం చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజా వలి, జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి జ్యోతిబసు, నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస రావు, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, జిల్లా అధికారులు, కార్పొరేటర్లు, అవార్డు గ్రహీతలు తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

మరో ఇద్దరికి తీవ్ర గాయాలు



ఘటనాస్థలంలో రసూల్ మృతదేహం

తెనాలి రూరల్: బైక్‌ను వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, మృతుని బంధువులు తెలిపిన వివరాల మేరకు... పట్టణంలోని మారిస్‌పేటలో ఉన్న సీఎం కాలనీలో ఆదివారం రాత్రి గ్యార్మీ పండుగ చేసుకున్నారు. దీనికి బాపట్ల జిల్లా అప్పికట్లకు చెందిన నాయబ్ రసూల్ (45), అతని బంధువు గౌస్‌బాషా, మరో చిన్నారి వసీం తమ కుటుంబసభ్యులతో వచ్చారు. తిరిగి సోమవారం ఉదయం అప్పికట్లకు బైక్‌పై వెళుతున్నారు. ఈ క్రమంలో తెనాలి వైకుంఠపురం నుంచి జగ్గడిగుంటపాలెం వైపు వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో నాయబ్‌రసూల్ అక్కడికక్కడే మృతి చెందాడు. మిగతా ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108లో తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. ఘటనాస్థలాన్ని త్రీ టౌన్ పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి

మంగళగిరి టౌన్: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం చెందిన ఘటన మంగళగిరి పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణ ఎస్ఐ రవీంద్రనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తి గుంటూరు, విజయవాడ జాతీయ రహదారిపై శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కాలనీ సమీపంలో రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి వయస్సు 25–30 మధ్య ఉంటుందని, శరీరంపై ఎరుపురంగు టీ షర్ట్, నలుపురంగు ప్యాంటు ఉన్నాయని పోలీసులు తెలిపారు. ఇతర వివరాలు తెలియరాలేదని పేర్కొన్నారు. సమాచారం తెలిసిన వారు 86888 31559 నంబరులో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



ఘటనాస్థలంలో సురేంద్ర మృతదేహం

మంగళగిరి టౌన్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మంగళగిరిలో చోటుచేసుకుంది. సేకరించిన వివరాల మేరకు.. విజయవాడ, ఇబ్రహీంపట్నం ప్రాంతానికి చెందిన ముదిగొండ వెంకట ప్రమీల తన కుమారుడు వెంకట సురేంద్ర (18)తో కలసి ద్విచక్రవాహనంపై గుంటూరులోని బంధువుల ఇంటికి సోమవారం వెళ్లారు. తిరిగి వచ్చే క్రమంలో మంగళగిరి ఆత్మకూరు జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో ఇద్దరికీ తీవ్ర గాయాలు అయ్యాయి. సురేంద్ర అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో ప్రమీలను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న మంగళగిరి రూరల్ పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం సురేంద్ర మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం, వెంకటపాలెం, అమరావతి, గుంటూరు జిల్లా
టెండర్ నోటీసు
అమరావతి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు సమర్పించే కొబ్బరి ముక్కల హక్కును ఒక సంవత్సరము వరకు పొందుటకు టెండర్ మరియు బహిరంగ వేలం: 07.10.2025 మధ్యాహ్నం 03.00 గంటలకు వెంకటపాలెం ఆలయంలో నిర్వహించబడును. వివరాల కోసం సంప్రదించవలసిన నెం. 9333666143.
Roc No:TTD-40021/10/2025-PRO SEC (Adv.No.246) Date: 06.10.2025 కార్యనిర్వహణాధికారి

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE
HOUSE FOR SALE
Old అమరావతి మ్యూజియం దగ్గర రోడ్డు ప్రక్కనే 200 చ.గ.లలో నిర్మించిన ఇల్లు అమ్మబడును. ధర 80 లక్షలు. సంప్ర: 77024 38344

SERVICES
GOLD FINANCE
బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071
బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్‌క్యాష్) సంప్ర॥ 87907 41166

WANTED
బేబీకేర్ జీ: 18వేలు, ఇంటివంట జీ:18 వేలు, కేర్‌టేకర్ (మెడికల్) జీ:18 వేలు, వార్డెన్ డిగ్రీ, పీజీ, జీ:18వేలు. భోజనం, వసతి 98854 66598
గుంటూరు, అమరావతి రోడ్డులో గల వృద్ధాశ్రమం లో 25 మందికి అక్కడే ఉండి వంట చేయుటకు ఆడ / మగ వంట మనిషి కావలెను. మరియు డ్రైవర్ కూడా కావలెను. సెల్: 98485 60485
తెనాలిలోని ప్రముఖ హాస్పిటల్ నందు పని చేయుటకు PRO, స్టాఫ్ నర్స్ కావలెను. మంచిజీతం, టీబీ రోడ్డు, తెనాలి. 7702762108, 9666354489
తెనాలిలోని కృష్ణ డెకెన్ & పౌల్ట్రీ నందు క్యాషియర్ మరియు కలక్షన్ చేయుటకు M/F స్టాఫ్ కావలెను. 15000-18000. సంప్ర: 90522 90512
ప్రముఖ MNC, ఈ కామర్స్ వాటి అనుబంధ సంస్థలలో వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. అర్హత 10 to డిగ్రీ, జీతం 15000 నుంచి కలదు. సంప్ర: M.K. Enterprises. 8217813865
నరసరావుపేట దగ్గర ప్రముఖ ఆక్వా కంపెనీలో పని చేయుటకు బాయిలర్ ఆపరేటర్ కావలెను. ITI / డిప్లమా ఎలక్ట్రికల్ క్వాలిఫికేషన్ కలిగిన యువకులు కావలెను. బయోడేటా పంపవలసిన mail id: admin@valvin.in 96639 09856, 94414 84802
వాగ్దేళ్య ఇంటీరియర్స్ నందు జాబ్ చేయుటకు మార్కెటింగ్ టీమ్ అనుభవం గలవారు అర్జంటుగా కావలెను. అర్హత: డిగ్రీ. సంప్ర॥ 7599999729
రాజమండ్రి దగ్గర పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 12 గం డ్యూటీ, జీ: 12000, భోజనం+వసతి. చదువు అవసరం లేదు. వ. 50 సం లోపు 88014 97437
ప్రముఖ హోంకేర్ సంస్థ Hydలో వృద్ధులకు, పేషెంట్లకు సేవ చేయుటకు బేబీ కేర్, ఇంటి/వంట పనికి స్త్రీ/పు. కావలెను. జీ : 18,000 to 24,000. రూం+మీల్స్ ఫ్రీ. 9347148051

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ఎడిషన్ రూ. 475/- మాత్రమే
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
గుంటూరు
7075167663
7075167541

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని పరిశీలించిన తర్వాతే స్పందించాల్సిందిగా పాఠకులకు సూచన. ప్రకటనదారులు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తాపత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంకు అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సత్తా చాటిన 'విజయ'నగరం



విజేతగా నిలిచిన విజయనగరం జిల్లాకు చెందిన జట్లు

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో బాల,బాలికల జట్లకు ప్రథమ స్థానం

గొలుగొండ: రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో విజయనగరం విజయదుందుభి మోగించింది. అండర్–14 బాల, బాలికల విభాగాల్లో హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్‌ల్లో ఈ జిల్లా జట్లు ప్రథమ స్థానం సాధించాయి. అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం కృష్ణదేవిపేట గ్రామ హైస్కూల్లో ఈ నెల 4న ప్రారంభమైన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి బాల, బాలికల జట్లు పాల్గొన్నాయి. సోమవారం ఫైనల్లో విజయనగరం, గుంటూరు బాలురు జట్లు తలపడ్డాయి. ఇందులో 2 పాయింట్ల తేడాతో విజయనగరం విజేతగా నిలిచింది. అనంతరం బాలికల విభాగంలో విజయనగరం, చిత్తూరు జట్లు తలపడ్డాయి. విజయనగరం పాయింటు తేడాతో విజేతగా నిలిచింది. విజేతలకు నర్సీపట్నం టౌన్ సీఐ గోవిందరావు, కృష్ణదేవిపేట పూర్వపు ఎస్ఐ తారకేశ్వర్రావు, సాఫ్ట్‌బాల్ నిర్వహణ ప్రతినిధులు రమణ, శ్రీనివాసరావు, సుమంత్‌రెడ్డి, సూర్య దేముడు, సతీష్, భవానీ, చంద్రమోహన్ బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని వారు సూచించారు.

చెకుముకి సంబరాలను విజయవంతం చేయాలని పిలుపు



పోస్టర్లు విడుదల చేస్తున్న కేఎస్ లక్ష్మణరావు, తవ్వా సురేష్ తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో సృజనాత్మకను వెలికితీసేందుకు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాలను విజయవంతం చేయాలని జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. సోమవారం బ్రాడీపేటలో సైన్స్ సంబరాల పోస్టర్లు విడుదల చేశారు. లక్ష్మణరావు మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక గత 35 ఏళ్లుగా ఈ సంబరాలను నిర్వహిస్తోందని వివరించారు. ఈ నెల 8న పాఠశాల స్థాయి, నవంబర్ 1న మండల స్థాయి, 23న జిల్లా స్థాయిలో పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. డిసెంబర్ 12, 13, 14వ తేదీల్లో రాష్ట్రస్థాయి పోటీలు జరుగుతాయని వివరించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సంబరాల నిర్వహణకు విద్యాశాఖ అనుమతి ఇచ్చిందని చెప్పారు. ఆయా పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులను ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తవ్వా సురేష్, ఎం.ఉదయ్ భాస్కర్, టి.జాన్‌బాబు, జి.వెంకట్రావు, టీఆర్ రమేష్, టీఆర్ చాందిని, కె.శ్రీనివాస్, యు.రాజశేఖర్, ఎ.శ్రీనివాస్, భాస్కరరావు, వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

11న టీచర్ల సభకు తరలిరండి

గుంటూరు ఎడ్యుకేషన్: ఈ నెల 11వ తేదీన విజయవాడలోని ధర్నా చౌక్‌లో తలపెట్టిన 1998–డీఎస్సీ ఎంటీఎస్ ఉపాధ్యాయుల రాష్ట్ర స్థాయి విజ్ఞాపన సభకు తరలిరావాలని గుంటూరు జిల్లా 98 ఎంటీఎస్ టీచర్ల మహిళా విభాగ అధ్యక్షురాలు శారద, శౌరీలమ్మ, ధనలక్ష్మి, పార్వతి, రూత్ బస్లీనాలు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తమ సేవలను క్రమబద్ధీకరించి, ఉద్యోగ విరమణ వయసు 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలని కోరారు. రిటైర్ అయినవారికి రూ.20 వేల పింఛన్ అందించాలని డిమాండ్ చేశారు. పలు డిమాండ్‌లతో చేపడుతున్న సభకు ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు.

వృద్ధుడిని బలిగొన్న బైకు

మోతడక(తాడికొండ): ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధుడు మృతి చెందిన ఘటన తాడికొండ మండలం మోతడక గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోతడక గ్రామానికి చెందిన కొమ్మినేని సాంబశివరావు (67) ఆదివారం సాయంత్రం సచివాలయం సెంటర్‌లో రోడ్డు దాటుతున్నాడు. అమరావతి వైపు నుంచి వస్తున్న ద్విచక్ర వాహనం వేగంగా అతడిని ఢీకొట్టింది. తలకు బలమైన గాయం కావడంతో వెంటనే జీజీహెచ్‌కు తరలించారు. అప్పటికే అతడు మరణించినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వాసు తెలిపారు.

ఏనుగుపాలెంలో యువకుడు హత్య

వినుకొండ: పల్నాడు జిల్లా వినుకొండ రూరల్ మండలం ఏనుగుపాలెం గ్రామంలో యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన గుంటూరు శివ (35)ను గుర్తుతెలియని వ్యక్తులు గ్రామ సమీప పొలాల్లో గడ్డపారతో పొడిచి హత్య చేసినట్లు సోమవారం గుర్తించారు. స్థానిక రైతులు ఇచ్చిన సమాచారంతో నరసరావుపేట డీఎస్పీ హనుమంతరావు, ఇన్‌చార్జి సీఐ బాలాజీ వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు.

అమరావతిలో ఏడీబీ బృందం పర్యటన



వివరాలు తెలుసుకుంటున్న బ్యాంకు ప్రతినిధులు

తాడికొండ: ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) బృందం సోమవారం రాజధాని అమరావతి ప్రాంతంలో పర్యటించింది. తొలుత విజయవాడలోని సీఆర్‌డీఏ కార్యాలయానికి వెళ్లిన ఆ బృందానికి కమిషనర్ కె.కన్నబాబు, అడిషనల్ కమిషనర్లు జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్, అమిలినేని భార్గవ్ తేజలు స్వాగతం పలికారు. అనంతరం సీఆర్‌డీఏ, అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీఎల్)లోని ముఖ్య అధికారులతో బృందం సమావేశమైంది. అమరావతి నిర్మాణ పురోగతిని కమిషనర్ కన్నబాబు వివరించారు. తర్వాత రాజధాని ప్రాంతంలో కొనసాగుతున్న పలు పనులను బృందం పరిశీలించింది. గ్రీవెన్స్ రిడ్రెస్సల్ మెకానిజం(జీఆర్ఎం) గురించి వివరాలు తెలుసుకుంది. దీనిపై సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. పర్యటనలో ఏడీబీ– వాటర్ – అర్బన్ డెవలప్మెంట్ సెక్టార్ బృందంలోని సభ్యులైన నోరియా సైటో (సీనియర్ డైరెక్టర్), మనోజ్ శర్మ (డైరెక్టర్), సంజయ్ జోషి (ప్రిన్సిపాల్ అర్బన్ డెవలప్మెంట్ స్పెషలిస్ట్), అశ్విన్ హోసూర్ విశ్వనాథ్ (సీనియర్ ప్రాజెక్టు ఆఫీసర్)లు పాల్గొన్నారు.